నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 26 జనవరి 2024 | SURYAPET

సూర్యాపేట పాత ఎస్పీ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు సిద్ధం

- ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

సూర్యాపేట, జనవరి 25 : 75వ భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రం ఇందిరమ్మ కాలనీ పాత జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు అధికారులు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 9.05 గంటలకు జిల్లా అభివృద్ధి సందేశం ప్రారంభిస్తారు. 9.20 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులు, అతిథులతో పరిచయ కార్యక్రమం, 9.30 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మం, 9.45 గంటలు ప్రశంసా పత్రాల ప్రదానం ఉంటుందని అధికారులు తెలిపారు. 10 గంటలకు కార్యక్రమం ముగించనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఉదయం 8 గంటలకు కల్టరేట్‌లో కలెక్టర్ వెంకట్రావ్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను గురువారం ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించారు.

సూదిలో ఇమిడి పోయే జాతీయ జెండా


చాక్‌పీస్‌పై వందేమాతరం గీతం

సూదిలో ఇమిడిపోయే జాతీయ జెండా

తమలపాకుల సైదులు

కోదాడ టౌన్, జనవరి 25 : కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు రిపబ్లిక్ డే సందర్భంగా సూది రంధ్రంలో ఇమిడిపోయే అతి చిన్న సైజు 8 మిల్లీమీటర్ల ఎత్తు గల జాతీయ జెండాను తయారు చేశాడు. అదేవిధంగా 1.5 సెంటీమీటర్ల పొడవు, 10 మిల్లీ మీటర్ల వెడల్పు గల చాక్‌పీస్‌పై వందే మాతరం గీతాన్ని రాసి అబ్బురపరిచారు. సైదులు గతంలోనూ బియ్యం, ఆవగింజ, నువ్వుల గింజపై జాతీయ జెండాను తయారు చేసి ఔరా అనిపించుకున్నారు. అతి చిన్న సైజు జాతీయ జెండాను తయారు చేసిన సైదులును పలువురు అభినందించారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. రాజగోపాల్, చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- జిల్లా జడ్జి జి.రాజగోపాల్

సూర్యాపేట, జనవరి 25 : యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా జడ్జి జి. రాజగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఓటు వజ్రాయుధమని, ఓటు అవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది మనకు ప్రథమ హక్కుగా భావించాలని తెలిపారు. ఎన్నికల్లో ఓటు ద్వారా నిజాయితీ, నిబద్ధత గల మంచి నాయకుడిని ఎన్నుకోవచ్చని, అలాంటి నాయకులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో యువత పెద్దఎత్తున ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. అంతకు ముందు స్థానిక కలెక్టరేట్ రోడ్డులో భవిత జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సన్మానించి యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఇన్‌చార్జి ఆర్డీఓ కృష్ణయ్య, తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యాపేటలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

అభివృద్ధి కావాలంటే దళిత మహిళ ను కుర్చీ దింపాలా..?

- అధికార పక్షం ఆటలో కౌన్సిలర్లు బలి కావద్దు
- సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణపై పెట్టిన అవిశ్వాసాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు

బొడ్రాయిబజార్, జనవరి 25 : 70 సంవత్సరాల సూర్యాపేట మున్సిపల్ చరిత్రలో ఒక జనరల్ స్థానంలో దళిత మహిళను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చైర్ పర్సన్‌గా చేస్తే నేడు అధికార కాంగ్రెస్ పార్టీ పన్నాగాలు పన్ని ఆవిశ్వాసం పెట్టి ఆమెను పీఠంపై నుంచి దించేయాలనుకోవడం కుట్రపూరితం, దుర్మార్గమని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. దళిత చైర్‌పర్సన్ అన్నపూర్ణపై పెట్టిన ఆవిశ్వాసాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సూర్యాపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేండ్ల పరిపాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ చేసిన అవినీతి ఏంటో, చేయని అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో విలీన గ్రామాలు కలసినప్పటికీ ఏ ఒక్క వార్డును నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని తెలిపారు. రెండేండ్ల కరోనా సమయంలో సైతం ప్రతి సమస్యను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని, ఆమెను పదవి నుంచి దింపేయాలనుకోవడం అనాలోచితమని చెప్పారు. అధికార పక్షంలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని అనుకోవడం పొరపాటని, అగ్ర వర్ణాలతో కలిసి అధికార పక్షం ఆడించే ఆటలో కౌన్సిలర్లు బలి కావద్దని హితవుపలికారు. కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ఉపసంహరించుకొని చైర్‌పర్సన్‌తో కలిసి పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, లేని పక్షంలో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రతి కౌన్సిలర్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రావణ్‌కుమార్‌మాదిగ, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొడ్డు సైదమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు మల్సూర్, నాయకులు బొల్లి అశోక్, నకిరేకంటి సైదులు , కొండేటి సందీప్, మీసాల శివరామకృష్ణ, ఎడవెల్లి రాము, సూరారపు నాగయ్య, ఒగ్గు రవి, ముల్కలపల్లి కోటయ్య, ముల్కలపల్లి శ్రీను, బచ్చలకూరి జానయ్య పాల్గొన్నారు.

నిలిచిన నిధులు.. ఆగిన అభివృద్ధి

ఐదు మున్సిపాలిటీల్లో రూ.157 కోట్లు నిలిపివేత

కేసీఆర్ ప్రభుత్వం ఇస్తే.. ఆపిన కాంగ్రెస్ సర్కారు

పట్టణాల్లో ఆగిపోయిన పలు అభివృద్ధి పనులు

నిధులు నిలిపివేయడంతో ఆగిన సూర్యాపేట శ్రీరాంనగర్‌లోని రోడ్డు నిర్మాణం

సూర్యాపేట, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ప్రస్తుత సర్కారు నిలిపివేయడంతో పలు అభివృద్ధి పనులు ఆగిపోయాయి. మాజీ సీఎం కేసీఆర్ సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇచ్చారు. తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల పురపాలికలకు రూ.25 కోట్ల చొప్పున వంద కోట్ల రూపాయలు విడుదల చేశారు. ఆ నిధులతో పనులు చేసేందుకు అన్ని చోట్లా టెండర్లు పిలిచారు. సూర్యాపేటలో రూ.3కోట్ల పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభమైన పనులు మాత్రమే కొనసాగిస్తూ మిగతా వాటిని నిలిపివేసింది. అలాగే సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.30 కోట్ల టీఎఫ్‌డీసీ నిధులు వస్తే.. ఇందులో రూ.10 కోట్ల పనులు నిలిచిపోయాయి. మొత్తంగా సూర్యాపేట జిల్లాలో గత సర్కారు మంజూరు చేసిన 157 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

సమైక్య రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన పట్టణాలు, పల్లెలను ప్రగతి పథంలో నడిపేందుకు కేసీఆర్ ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిన నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా మున్సిపాలిటీల అభివృద్ధి కోసం పట్టణ ప్రగతి పేరిట నెలనెలా కోట్లాది రూపాయలు విడుదల చేసింది. దాంతోపాటు అనేక రకాల నిధులతో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో కొత్త రోడ్లు, అవసరమున్న ప్రతి చోటా డ్రైనేజీ కాల్వలు, రహదారులకు ఇరువైపులా పచ్చదనాన్ని వెదజల్లే మొక్కలు, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసింది. సూర్యాపేట కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మున్సిపాలిటీల పరిధి శివారు ప్రాంతాల్లోని రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతోపాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు హామీ ఇచ్చారు. ఆ వెంటనే సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగతా నాలుగు పురపాలికలకు రూ.25కోట్ల చొప్పున 100 కోట్లకు సంబంధించి జీఓలు విడుదల చేశారు. అలాగే.. అన్ని మున్సిపాలిటీల్లో టెండర్లు సైతం పిలిచారు. ఎన్నికల కోడ్ రావడంతో పనుల ప్రారంభం ఆగిపోయింది. అప్పటికే సూర్యాపేటలో 10 కోట్ల రూపాయల పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వగా రూ.3 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన ఏడు కోట్లతోపాటు మిగతా నాలుగు మున్సిపాలిటీల్లో పనులన్నీ టెండర్ దశలో ఉన్నాయి. తదనంతరం ఎన్నికలు రావడం ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం విదితమే. అప్పటికే మంజూరైన నిధులతో మౌళిక సదుపాయల కల్పన జరుగుతుందని అందరూ భావించినప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. దాంతో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో రూ.147 కోట్ల పనులు నిలిచిపోగా.. గతంలో సూర్యాపేట పట్టణానికి వచ్చిన రూ.30 కోట్ల టీఎఫ్‌డీసీ నిధుల్లో పనులు ప్రారంభం కాని రూ.10 కోట్లు కూడా ఆగిపోయాయి. మొత్తం కలిపి రూ.157 కోట్లు నిలిపివేయడంతో పట్టణాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం మళ్లీ నిధులు మంజూరు చేసి పట్టణాల్లో అభివృద్ధిని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

బేతవోలు జడ్పీ పాఠశాలలో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఎంపిక

చిలుకూరు, జనవరి 25 : రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి ఇంటింటా ఇన్నోవేటర్-2024 అవార్డుకు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు చందా శ్రీనివాస్ ఎంపికయ్యారు. సూర్యరశ్మి సహాయంతో ఆహార పదార్థాలను ఆరబెట్టుకొనే యంత్రాన్ని తయారు చేసినందుకుగాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. తక్కువ ఖర్చుతో ఆహార పదార్థాలను పరోక్షంగా సూర్యరశ్మి సహాయంతో, ఎటువంటి రక్షణ అవసరం లేకుండా.. రంగు, రుచి, వాసన మరియు పోషక విలువలు పోగొట్టకుండా ఎండబెట్టుకోవడానికి ఈ పరికరం కనిపెట్టినట్లుగా శ్రీనివాస్ తెలిపారు. ఈ పరికరం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రయోగం ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. శ్రీనివాస్‌ను గురువారం స్థానిక పాఠశాలలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయయులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి చంద్రకళ, ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, ధనమూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీలో జిల్లావాసులకు చోటు

- సభ్యులుగా పాల్వాయి రజినీకుమారి, నర్రి యాదయ్య నియామకం

నర్రి యాదయ్య

పాల్వాయి రజినీకుమారి

సూర్యాపేట, జనవరి 25 (నమస్తే తెలంగాణ)/సంస్థాన్ నారాయణపురం, జనవరి 25 : టీఎస్‌పీఎస్‌సీ సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పాల్వాయి రజినీకుమారి, సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి యాదయ్య నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీఓ విడుదల చేసింది. 1972 మే 6న నూతనకల్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి రాములు, భార్గవి దంపతులకు జన్మించిన రజినీకుమారి ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ పూర్తి చేశారు. తొలుత కొంతకాలం ప్రైవేట్ టీచర్‌గా పనిచేయగా, 2000 సంవత్సరంలో గ్రూప్-3 ద్వారా వీడీఓ ఉద్యోగం సాధించారు. తదనంతరం వీఓఆర్‌డీగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరం గ్రూప్-1కు ఎంపికై ఖైరతాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా, తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. 2004 వరకు విధులు నిర్వర్తించిన ఆమె.. అదే సంవత్సరం ఉద్యోగానికి రాజీనామా చేసి సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన ఆమె.. 2014లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. 2017లో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరి స్పోక్స్‌పర్సన్‌గా పని చేశారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ మెంబర్‌గా ఎంపిక చేశారు.

మారుమూల గ్రామం నుంచి జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ స్థాయికి నర్రి యాదయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి యాదయ్య ప్రస్తుతం జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామం మల్లారెడ్డిగూడేనికి చెందిన నర్రి దుర్గయ్య, మల్లమ్మ దంపతుల కుమారుడు యాదయ్య స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, సర్వేల్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివారు. మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, 1988లో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. 2000 సంవత్సరంతో జేఎన్‌టీయూ హెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 200 z6లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 1999లో యంగ్ సైంటిస్ట్ ఫెలోషిప్, 2015లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దాదాపు 31 సంత్సరాలు ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన.. ఎంసెట్, ఈసెట్‌కు రెండు సార్లు కన్వీనర్‌గా పనిచేశారు. 10 సార్లు రిక్రూట్‌మెంట్ పరీక్షల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. 10 మంది పీహెచ్‌డీ, 80 ఎంటెక్ ప్రాజెక్టులకు నిర్దేశకుడిగా పని చేశారు. ప్రొఫెసర్‌గా, యంగ్ సైంటిస్ట్‌గా ఎన్నో రివార్డు లు, అవార్డులు అందుకుని అంచెలంచెలుగా ఎదిగి పదోన్నతులు పొందిన నర్రి యాదయ్య టీఎస్‌పీఎస్‌సీ బోర్డు మెంబర్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కలెక్టర్ వెంకట్రావ్‌కు బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డు

సూర్యాపేట, జనవరి 25 : జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్‌కు బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డు -2024ను పొందారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తమ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ విభాగంలో స్టేట్ కేటగిరీ అవార్డును అందించింది. అవార్డు అందుకున్న కలెక్టర్‌కు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

సైదన్న ఉర్సు షురూ

తొలిరోజు దట్టీలతో అలంకరణ.. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు

నేడు గంధోత్సవం.. తరలి రానున్న భక్తులు

విద్యుత్ వెలుగులో సర్వాంగ సుందరంగా దర్గా

పాలకవీడు, జనవరి 25 : మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల జాతరలో తొలిరోజు గుసూల్ షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున దర్గా పూజారి సయ్యద్ జానీ గృహం నుంచి మేళతాళాలతో గంధ కలశాలను, దట్టీలను తలపై ఎత్తుకొని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని హజ్రత్ సయ్యద్, మొహినుద్దీన్ షా, జాన్ పాక్ షహీద్ రహమతుల్లా అలై సమాధులతోపాటు బయట ఉన్న సైనిక సమాధులపై గంధం చల్లి, పూలమాలలు, దట్టీలతో అలంకరించారు. సమాధుల చుట్టూ మహిళలు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. దర్గాలో మగ్రీబ్ నమాజ్, ఈషాద్ నమాజ్‌లను దర్గా ముజావర్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గాకు వచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. సమీపంలో గల నాగదేవతకు మహిళలు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి.

నేడు ఉర్సే షరీఫ్

ఉర్సులో ప్రధాన ఘట్టం రెండో రోజు గంధోత్సవం (ఉర్సే షరీఫ్). గంధోత్సవానికి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. కోదాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు నలమాద ఉత్తమ్ పద్మావతి, బీఎల్‌ఆర్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సైతం రానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. అందుకు తగ్గట్లుగా వక్ఫ్ బోర్డు, జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు.

అలరించిన ఖవ్వాలి

ఉర్సు సందర్భంగా ఫకీరులు జాన్‌పహాడ్ దర్గాకు తరలివచ్చారు. ఈ సందర్భంగా దర్గా లోపల, బయట ఫకీరులు నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం అలరించింది. దట్టీల ఊరేగింపులో వీరి సందడి కనిపించింది.

భక్తులకు ఇబ్బంది లేకుండా..

గంధం ఊరేగింపునకు శుక్రవారం భక్తులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం జాన్‌పహాడ్ దర్గా వద్ద బందోబస్తు పర్యవేక్షించారు. నేరేడుచర్ల నుంచి వచ్చే వాహనాలను జాన్‌పహాడ్ గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద, దామరచర్ల నుంచి వచ్చే వాహనాలను శూన్యపహాడ్ రోడ్డులోని రైల్వే ట్రాక్ వద్ద, దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వైపు నుంచి వచ్చే వాహనాలను రావిపహాడ్ గ్రామానికి వెళ్లే దారిలోనే నిలిపివేయడానికి పోలీసు శాఖ చేసిన పార్కింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం జేపీఎస్ ఫంక్షన్‌హాల్‌లో పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి బందోబస్తుపై పలు సూచనలు ఇచ్చారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు. కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి వయా దామరచర్ల, నేరేడుచర్ల మీదుగా 30కి పైగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది.

దట్టీలు తీసుకొని వస్తున్న ముజావర్ కుటుంబం